
'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

-డి. శ్రీనివాస్



# తుఫాను

అల్లంత దూరంలో నీలి సముద్రం. తెల్లని ఇసుక. మరోవైపు పండంటి వెన్నెల. ఆకాశాన్ని అనంత సాగరాన్ని కలుపుతున్నాడా అన్నట్లుగా ఉన్న చంద్రుడు. గంగ సముద్రంవైపు చూస్తూ కూర్చుంది. అది ప్రశాంతంగా ఉంది... గంగ మనసులోనే. అప్పటికి చీకట్లు పూర్తిగా కమ్ముకున్నాయి. వెన్నెల రోజులు కావడంతో చంద్రుని వెలుగులో సముద్రపు నీరు వింత కాంతులతో మెరుస్తుంది. రివ్వున వీచే గాలికి ఎగురుతున్న పైటను సవరించుకొనేసరికి మెడ వంపులో మెత్తగా తగిలింది. పసుపుతాడు. గంగ ఆప్యాయంగా స్పృశించింది మెరిసే కళ్ళతో. పది రోజుల క్రితమే గంగకు పెళ్ళయ్యింది. తాను కోరుకున్న బావ శివుడితోనే పెళ్ళి కావడమూ, బావ తనను అపురూపంగా చూసుకోవడమూ, గంగకు ఎంతో ఆనందాన్నిచ్చింది.

పెళ్ళికి ముందు, గంగ వాళ్ళ నాన్న నారాయణ, రోజూ తాగొచ్చి అమ్మకు నరకం చూపించేవాడు. అది సహించలేని గంగ అడ్డువెళితే గంగను కూడా చావబాదేవాడు. సముద్రపు వేటకు వెళ్ళగా వచ్చిన డబ్బంతా తాగడానికే సరిపోయేది కాదు. అమ్మ నాలుగిళ్ళలో పని చేసి, వచ్చిన డబ్బుతో తిండికి లోటు లేకుండా చూసుకొనేది. నారాయణ ఇష్టం వచ్చినంత తాగి, నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టి, ఇల్లంతా చిందర వందర చేసేవాడు. నారాయణ ఎన్ని మాటలు అన్నా, కొట్టినా సహనంగా ఊరుకునేది గంగ వాళ్ళ అమ్మ. తాగి వచ్చి పడిపోతే, అతనికి సపర్యలు చేసి, అన్నం తినిపించి నిద్ర పుచ్చేది. దాదాపుగా రోజూ ఇదే తంతు. అందుకే గంగకు నారాయణ అంటే అసహ్యం. నారాయణ ఎప్పుడైనా ఆప్యాయంగా మాట్లాడి దగ్గరవ్వాలని ప్రయత్నించినా గంగ దూరంగా ఉండిపోయేది. "ఎందుకమ్మా! ఇలాంటి తాగుబోతుకి సేవలు చేస్తావు?" అని ఆవేశంగా ప్రశ్నించేది. గంగ వాళ్ళ అమ్మ చిరునవ్వు నవ్వేది. "తప్పమ్మా... నాన్న గురించి ఇంకెప్పుడూ అలా మాట్లాడకు. మీ నాన్న దేవుడు. మనమంటే కిట్టని వాళ్ళు మీ నాన్నకు సారాయి అలవాటు చేసారు. అప్పటినుండి మీ నాన్న ఇలా అయిపోయాడు... మనకు కాకుండా పోయాడు అంటూ కన్నీళ్ళు పెట్టుకుంటుంది గంగ వాళ్ళ అమ్మ. అయినా తండ్రంటే ఎప్పుడూ అభిమానం చూపించలేదు గంగ. ఇలాంటి తాగుబోతు మాత్రం తనకు భర్తగా రాకూడదని భగవంతుడ్ని ప్రార్థించేది.

భగవంతుడు గంగ మొర ఆలకించినట్లే ఉన్నాడు. శివుడికి ఎలాంటి దురలవాట్లూ లేవు. గంగను ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. పెళ్ళయిన పదిరోజులూ వారి జీవితం ప్రశాంతంగా గడిచిపోయింది. పదకొండవ రోజు శివుడు అందరితోపాటుగా సముద్రపువేటకు బయలుదేరాడు. వేటకు వెళ్ళవద్దంటూ చాలా పట్టుపట్టింది గంగ. శివుడు గంగకు మెల్లగా నచ్చచెప్పాడు. "వేటకు వెళితేనే నాలుగు డబ్బులు వచ్చేది. అవి ఉంటేనే కద! నిన్ను పట్నం తీసుకు వెళ్ళేది. పట్నం వెళ్ళి మనం సినిమాలు చూడొచ్చు... కొత్త బట్టలు కొనుక్కోవచ్చు... మిలట్రీ హోటల్లో పలావు తినొచ్చు. అయినా ఎంత? యాటకు ఎల్లి సిటికెలో తిరిగి రాను" మురిపెంగా చెప్పాడు శివుడు, గంగ బుగ్గలు నిమురుతూ. అంతలో "ఒరేయ్ శివుడూ!... యాటకు వచ్చేది ఏవన్నా ఉందా లేదా?" విసుగ్గా అడిగాడు గంగ వాళ్ళ నాన్న నారాయణ. "తొందరగానే వచ్చేస్తానులే గంగా"అంటూ నెత్తిమీద చిన్నగా దెబ్బవేసి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు శివుడు. అప్పటికి వాళ్ళు వేటకు వెళ్ళి రెండురోజులయ్యింది. గంగకు బెంగగా ఉంది. రోజూ సముద్రం దగ్గరకు రావడం... శివుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూడటం...

"తొందరగా వచ్చేస్తే బావుండును." అప్పటికి పదోసారి అనుకుంది గంగ వాళ్ళ బావ గురించి. చిన్నగా చినుకులు మొదలయ్యాయి. వాతావరణంలో ఒక్కసారిగా మార్పువచ్చింది. విసురుగా గాలులు లేచి ఇసుక కంట్లో పడుతుంది. చిన్న చినుకులు నెమ్మదిగా పెద్ద వర్షంగా మారింది. గంగ ఇవేమీ గమనించే స్థితిలో లేదు. వానలో తడుస్తూ కేరింతలు కొట్టసాగింది. చిన్నప్పటినుండి గంగకు వర్షం అంటే చెప్పలేనంత ఇష్టం. "బావ కూడా ఉంటే ఎంత బావుండును... హాయిగా ఇద్దరూ తడుస్తూ కబుర్లు చెప్పుకుందుం." అనుకుంటూ చిన్న పిల్లలా చేతులు గాలిలో ఊపుతూ తడవ సాగింది గంగ. అంతలో "గంగా! చిన్న పిల్లలా వర్షంలో ఏంటా ఆటలు? కాసిన చేపల పులుసు చల్లారిపోతుంది. వేడి వేడిగా ఒక ముద్ద తిని, నిద్దుర పోదువు గాని రా." అంటూ పిలిచింది గంగ వాళ్ళ అమ్మ. గంగ భోజనం దగ్గర కూర్చుంది గాని, అన్నం సయించ లేదు. లేచి చేతులు కడుక్కొని మంచం మీద వాలింది. నిద్ర పట్టడంలేదు. శివుడు చేసే అల్లరి గుర్తొస్తుంది. నిద్ర పట్టక అలా దొర్లుతూనే, ఎప్పుడో అర్ధరాత్రివేళ నిద్రపోయింది.

తెల్లారి లేచేసరికి వాతావరణం బీభత్సంగా ఉంది. సముద్రపు అలలు భీకరంగా విరుచుకుపడుతున్నాయి. తీరం వైపుగా, గాలి వీచే వేగానికి కొబ్బరి చెట్లు అర్ధచంద్రాకారంలో ఊగుతున్నాయి. రామచంద్రుడు ఎక్కుపెట్టిన శివ ధనుస్సులా అవి ఏ క్షణాన్నైనా విరిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. తీరాన్నంతటినీ అమాంతంగా మింగేద్దామా అన్నట్టుగా తీవ్రంగా ఉంది సముద్ర ఘోష. తీరానికి దగ్గరగా ఉన్న గుడిసెలలో కొన్ని పైకప్పులు ఎగిరిపోయి, కొన్ని గుడిసెలు పడిపోయి ఉన్నాయి. పల్లెలోని అందరూ ఒకచోట గుమిగూడి, రేడియోలో తుఫాను తీవ్రత గూర్చి వార్తలు వింటున్నారు. సముద్రంలోనికి వెళ్ళిన వాళ్ళను గూర్చి అందరూ తలో రకంగానూ చెప్పుకుంటున్నారు. వాళ్ళ మాటలు వినేసరికి గంగకు భయం మొదలయ్యింది. "తన బావకు ఏమీకాదుగా?... బావ క్షేమంగా తిరిగొస్తాడుగా?" గంగ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. గంగ వాళ్ళమ్మ గంగను ఓదార్చింది. "ఆ గంగమ్మ తల్లి ఎప్పటికీ మనకు అన్యాయం చెయ్యదని బావతోపాటూ మీ అయ్య కూడా ఉన్నాడుగా... ఇలాంటి తుఫానులు మీ అయ్య ఎన్ని చూసాడో. శివుడ్ని మీ అయ్య భద్రంగా తీసుకొస్తాడులే"అని ధైర్యం చెప్పింది.

"తొందరగా వచ్చే స్తే బావుండును." అప్పటికి పదోసారి అనుకుంది గంగ వాళ్ళ బావ గురించి. చిన్నగా చినుకులు మొదలయ్యాయి. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. విసురుగా గాలులు లేచి ఇసుక కంట్లో పడుతుంది.

అప్పటికి తుఫాను మొదలై రెండు రోజులయ్యింది. ప్రకృతి బీభత్సం కొనసాగుతూనే ఉంది. కండ పోతగా వాన కురుస్తూనే ఉంది. సముద్రంపై వేటకు వెళ్ళిన చాలా మంది మత్స్యకారులు గల్లంతయ్యారు. చాలా తక్కువ మంది మాత్రం అతి కష్టంమీద తిరిగొచ్చారు. శివుడు, అతనితో వెళ్ళిన నారాయణ వాళ్ళూ మాత్రం రాలేదు. ఏడ్చి ఏడ్చి గంగ కళ్ళు ఎర్రకలువలయ్యాయి. ఈ రెండు రోజులుగా సరైన తిండి, నిద్ర లేకపోవడంతో పిచ్చిదానిలా తయారయ్యింది. ఏడవడానికి కూడా ఓపిక లేక అలాగే ఇంటి ముందున్న స్థంభానికి జారబడిపోయింది. పల్లెపల్లంతా శోక దేవత తాండవిస్తుంది.

శివుడు వాళ్ళూ వెళ్ళిన నాటు పడవ వెళ్ళిన రెండో రోజే తుఫాను తాకిడికి గురయ్యింది. తాడి చెట్టంత లేచే కెరటాలు ఆ నాటు పడవతో బంతాట ఆడుకుంటున్నాయి. పడవలో ఉన్న వాళ్ళు ఒక రోజంతా ధైర్యంగానే ఉన్నారు గాని, రాను రాను వారిలో నెమ్మదిగా భయం మొదలయ్యింది.

వెంట తెచ్చుకున్న ఆహారం కూడా అయిపోయింది. తినడానికి తిండి లేదు. కనుచూపు మేరంతా అనంతమైన జల రాశే...కాని తాగడానికి చుక్క నీరు లేదు. హోరు మంటూ ఈదురు గాలి. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. ఎంతటి ధైర్యవంతునికైనా ఒళ్ళు జలదరిస్తుంది. తుఫాను తాకిడికి ఆ చిన్ని పడవ ఎగిరెగిరి పడసాగింది ఇక మిమ్మల్ని భరించలేనన్నట్లుగా ప్రాణాలు అరచేత పట్టుకొని బిక్కు బిక్కుమంటూ కూచున్నారు అందరూ. శివుడికి గంగ గుర్తొచ్చింది. "గంగ ఇప్పుడు ఏం చేస్తూ ఉంటుంది?...నా కోసమే ఏడుస్తూ ఉంటుందేమో?... గంగను మళ్ళీ ప్రాణాలతో చూడగలనా?..." అన్నీ ప్రశ్నలే. అందరి మొహాల్లోనూ ఇవే ప్రశ్నలు. తమ వాళ్ళను చూడగలమా అని... జవాబు చెప్పేవారే లేరు.

పరిస్థితిని అర్థంచేసుకున్న నారాయణ తన వాళ్ళకు ధైర్యం చెప్పాడు. "ఒరేయ్! ధైర్యంగా ఉండండ్రా... తెరచాపను ఎత్తి పడవను సరిగ్గా నిలబెట్టండ్రా. మన జీవితంలో ఇలాంటి తుఫాన్లు ఎన్ని చూడలేదు? ఎన్నిసార్లు నవ్వుతూ ఇంటికి వెళ్ళిపోలేదు? కొద్దిగా గాలి ఇసురు గాని తగ్గిందంటే మన పడవను రేవువైపుగా తిప్పేయ్యొచ్చు". అంత హోరు గాలిలో గొంతు చించుకొని అరుస్తున్నాడు నారాయణ. అంతలో ఒక బ్రహ్మాండమైన అల అమాంతం వాళ్ళ పడవను విసిరికొట్టింది. ఆ విసురుకి తెరచాప రెండు ముక్కలయ్యింది. నావతోబాటుగా అందరూ తలో దిక్కు అయ్యారు.

"అయిపోయింది... గంగకు నాకూ ఈ రోజుతో ఋణం తీరిపోయింది." అనుకుంటుండగానే శివుడి కంట్లో నీళ్ళు తిరిగాయి. జీవితాంతం తోడు నీడగా ఉంటానని బాసచేసి పట్టుమని పదిరోజులు కాకుండానే గంగను కష్టాల కౌగిలికి వదిలి, తాను కడలికి బలి కాబోతున్నాడు. కన్న కలలన్ని కల్లలు కాగా గంగకు కన్నీరు మాత్రం మిగులుతుంది. బయట హోరుమంటూ తుఫాను. గుండెల్లోకూడా అదే తుఫాను. అతని కళ్ళ నుండి కారే కన్నీరే మరో బంగాళాఖాతంలా ఉంది. శివుడికి బిగ్గరగా ఏడవాలనిపిస్తుంది. కాని ఏడుపు మాత్రం రావడం లేదు. అతని కనులు మాత్రం నిశ్శబ్దంగా వర్షిస్తూనే ఉన్నాయి గంగ జ్ఞాపకాలతో.



"శివుడూ! ఈ కొయ్య దుంగ సాయంతో ఈదుకుంటూ వెళ్ళిపో... ఈ తూర్పుగా వెళ్ళితే మన రేవు చేరుకుంటావు. ఇక భయం లేదు. వెళ్ళిరా...!"అన్నాడు నారాయణ. ఆయాసంతో నోట మాట సరిగా రావడం లేదు. మాట మాటకు మధ్య ఒగురుస్తూ అలసట తీర్చుకుంటున్నాడు.

అప్పటికి నాలుగు గంటలుగా ఏక బిగిన ఈదుతూనే ఉన్నాడు శివుడు. తన వాళ్ళు ఏమయ్యారో తెలియదు. తీరం ఎటువైపు ఉందో అసలు తెలియదు. గుడ్డిగా ఈదడమే... ఈది ఈది రెక్కలు పడిపోయాయి చుట్టూ ఉన్న సముద్రపు నీరు నువ్వు తప్పించుకోలేవు అన్నట్టుగా ఎగిరెగిరి పడుతుంది. మంచుకంటే చల్లగా ఉండి వెన్నులో వణుకు తెప్పిస్తున్నారు. దాహంతో గొంతు తడారిపోయింది. ఇక చావు ఖాయం అనుకుంటుండగా నిశ్శబ్దంగా ఈదుకుంటూ, ఒక కొయ్య దుంగ లాంటిది తీసుకొని వచ్చాడు నారాయణ.

"శివుడూ! ఈ కొయ్య దుంగ సాయంతో ఈదుకుంటూ వెళ్ళిపో... ఈ తూర్పుగా వెళ్ళితే మన రేవు చేరుకుంటావు. ఇక భయం లేదు. వెళ్ళిరా...!"అన్నాడు నారాయణ. ఆయాసంతో నోట మాట సరిగా రావడంలేదు. మాట మాటకు మధ్య ఒగురుస్తూ అలసట తీర్చుకుంటున్నాడు. "నువ్వు కూడా రా మావా! ఇద్దరం కలిసే వెళదాం." అన్నాడు శివుడు ఆనందంగా. "అది ఒక్కరిని మాత్రమే భరించగలదురా... నేను ఎలాగోలా వస్తాను గాని నా బంగారు తల్లి గంగ నీకోసమే ఎదురు చూస్తుంది... నువ్వు బయలుదేరు, తుఫాను జోరు ఇంకా పెరిగేట్టుంది అంటూ తొందర చేసాడు నారాయణ. శివుడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతనికి అర్థం అవుతుంది. తనను రక్షించి అతడు ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డాడు. "నేను ఒక్కడినే వెళితే అత్తకు ఏమని సమాధానం చెప్పను మావా?" బేలగా అడిగాడు శివుడు. ప్రశాంతంగా నవ్వాడు గంగ వాళ్ళ అయ్య. "వయసు మీరిన వాడిని ఇప్పుడు కాకపోతే రేపయినా చావ వలసిన వాడనే... వల్లకాటికి పోవలసిన వాడినే. నువ్వు ఇప్పుడే జీవితాన్ని మొదలుపెట్టావు. బ్రతుకులోని తీపేంటో నీకు అనుభవం కాలేదు. అవన్నీ నా గంగతో కలిసి ఆనందంగా అనుభవించాలి. నిండు నూరేళ్ళు పిల్ల పాపలతో వర్ధిల్లాలి". ఆయాసంతో నారాయణ మాటలు తడబడుతున్నాయి. సముద్రపు నీటి చల్లదనానికి చేతులు కొయ్యబారిపోయి పట్టుతప్పుతున్నాయి. ఊపిరి ఆడక ఎగశ్వాస తీసుకుంటున్నాడు.

"నిన్ను ఒంటరిగా వదిలి వెళ్ళలేను మావా... వెళితే ఇద్దరం వెళదాం... లేకపోతే ఇద్దరం కలిసే చద్దాం!" మొండిగా అన్నాడు శివుడు.

"ఎక్కడికి పోతున్నానా? నా తల్లి దగ్గరకేగా... పుట్టి పెరిగిందంతా ఈ గంగమ్మ తల్లి ఒడిలోనే... చావుకూడా ఆ తల్లి ఒడిలోనే... అమ్మ దగ్గరకు వెళ్ళడానికి భయం ఎందుకురా?" ఆనందంగా వెళతాను. జీవితంలో అన్నీ నేను అనుభవించాను. మీ అత్తకు మాత్రం నేను అన్యాయం చేసానురా. మీ అత్తకు ఏ లోటు లేకుండా చూసుకో. చివరగా ఒక మాటరా... గంగ కోపదారిది , దానికి ఏ కష్టం కలక్కుండా చూసుకో. దానికి చెప్పు మీ అయ్య తాగుబోతే కాని చెడ్డోడు మాత్రం కాదని" అంటూ మరో మాటకు అవకాశం లేకుండా కొయ్య దుంగను బలంగా ముందుకు తోసి ఇక సెలవన్నట్లుగా చేయిని ఊపాడు. నెమ్మదిగా ఆ చేయి సముద్రంలో కలిసిపోయింది. నారాయణ శాశ్వతంగా జల సమాధి అయ్యాడు.

శివుడు నిశ్చేష్టుడయ్యాడు. తనముందే గంగ వాళ్ళ అయ్య జల సమాధి అయిపోయాడు. తను మాత్రం పిరికివాడిలా తన ప్రాణాలు కాపాడుకున్నాడు. మావ ఎంత పనిచేసాడు. అల్లుడికి కానీ కట్నం లేకుండానే కూతురిని అత్తారింటికి పంపావని తాను హాస్యం ఆడితే "నా ప్రాణాలు తీసుకోరా అల్లుడూ!"అనేవాడు. నిజంగానే తన ప్రాణాలను ఘనంగా పెట్టాడు. ఏ అల్లుడికి, ఏ మావా ఇవ్వని ఘనమైన కట్నం తన మావ ఇచ్చాడు. అందరితో పాటుగా తాగుబోతు నారాయణ అంటూ చులకన గానే చూసాడు గాని, మావ మనసు ఇంత ఉన్నతమైనదని తను ఊహించలేదు. తను ఎలాగైనా సరే రేవును చేరుకోవాలి. తన మావ గొప్పతనం, చేసిన త్యాగం ఊరందరికీ తెలియాలి ముఖ్యంగా గంగకు. అనుకుంటూ వేగంగా ఈదుతున్నాడు శివుడు. అతని ఆలోచనలకు సాయంగా అన్నట్టు తుఫాను తీవ్రత కూడా నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. ఇవేమీ పట్టనట్టుగా సాఫీగా తేలుతూ, ఒడ్డుకు సాగిపోతోంది కొయ్య దుంగ. ★



### జాకీలు!

ఆమధ్యవరకూ, పెట్రోలు డబ్బుతో మదాయించిన షేకులు ఒంటెల పోటీల్లో జాకీలుగా చిన్న పిల్లల్ని ఒంటెలపై కూర్చోపెట్టి పరుగులు తీయించేవారు. పాపం ఆ పిల్లలు ప్రాణభయంతో అగచాట్లు పడేవారు. ఇందువలన అనేక విమర్శలు రావడంచేత అరబ్ దేశాల్లో, ప్రస్తుతం జాకీలుగా రోబోను నియమించారు. ఒంటెలు పరుగులు తీస్తుంటే, జాకీలుగా వాటిపై అధిరోహించిన రోబోలను చూసి షేకులు ఆనందపడిపోతూ, పెట్రోలు డబ్బు విరజిమ్ముతున్నారు!

### తమాషా దొమ్మలు!

ఆమధ్య సాంఘైలో జరిగిన 48వ వరల్డ్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలో పిన్నలనూ పెద్దలనూ అలరించడంకోసం, ఆ క్రీడల నిర్వాహకులు పింగ్‌పాంగ్ బాల్స్‌తో చేసిన ముచ్చటైన ఆట బొమ్మలను అనేకం ప్రదర్శించి, వాటిని ప్రేక్షకులకు సావనీర్‌గా అందజేశారు. -కొడిమెల

